




# కరపత్రం

SINCE 2014

గురువారం జూలై 09, 2026 | సంపుటి : 2 | సంచిక : 267 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## రేవంత్‌తో మలేషియా ఎంపి శరవణన్ భేటీ

**హైదరాబాద్,జూలై8 :**
ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్డీ బోధీ పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మలేషియా పార్లమెంటు సభ్యుడు డా. ఎం.శరవణన్. మర్యాదపూర్వకంగా కలిసారు. గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 లో పాల్గొనడానికి హైదరాబాద్ కు వచ్చిన శరవణన్ సిఎంతో భేటీ అయ్యారు. సీఎంని కలిసిన వారిలో గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026 పాల్గొన్న మరికొందరు అంతర్జాతీయ ప్రతినిధులు ఉన్నారు..పర్యావరణ, సామాజిక, పరిపాలన పరమైన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, ఏఐ వినియోగంతో పాటు భవిష్యత్తు పెట్టుబడులపైన ముఖ్యమంత్రి, శరవణన్, అంతర్జాతీయ ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. మావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

- ఖమ్మం జిల్లాలో ఏర్పాటుపై సిఎంతో చర్చలు
- రేవంత్‌తో భేటీ అయిన గోద్రెజ్ ప్రతినిధులు

**హైదరాబాద్,జూలై8 :**
తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. కమ్మం జిల్లాలో ఏర్పాటు కానున్న దీనిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు.




2లో..

## తాడిచెర్ల-2 కేటాయింపులపై
# తప్పుడు ప్రకటన

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పుదోవ పట్టించే యత్నం
- 2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు
- మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్,జూలై8 :**
సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు.


2లో..

## ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే

- ఇప్పటికే బిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ది చెప్పారు
- పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోంది
- జూరాల, నెట్టంపాడు ముంపు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- జోగులాంబ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జోగులాంబ గద్వాల,జూలై8 :**
ఎప్పుడు ఎన్నికల వచ్చినా వార్ వన్ సైడేనని మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు.


2 లో

## ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై
# కట్టుకథలు

- నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతుంటే చోద్యమా
- గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,జూలై8 :**
ఒకపక్క నీళ్లు లేక పల్లెల్లో రైతన్నల కన్నీళ్లు పెట్టుకుంటుంటే.. మరోపక్క మేడిగడ్డ కాడ లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా కిందకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంలో నీరో చక్రవర్తిని మించిపోయి సర్కారు తమాషా చూస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ మీద కక్షతో రైతన్నలకు శిక్ష వేయడం తగునా అని నిలదీశారు. ఎల్‌నినో పడగ విప్పుతుంటే..ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ కూర్చుంటారా? ఇంకెన్నాళ్లు కాళేశ్వరం మీద దుష్ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తారు? ముఖ్యమంత్రికి రైతు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? అని మండిపడ్డారు.

## చంద్రబాబు కోసమే
# గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

- చెరువుల ఎండిపోతున్నా నీళ్లు ఎత్తి పోయడం లేదు


2లో..

- దేవాదుల ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు ఎత్తి పోయరా
- తుమ్మడిహట్టి వద్ద అనుమతులు అంటే ఆనాడే ఎందుకు కట్టలేదు
- క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన మిమ్ములను ఉరితీసినా పాపం లేదు
- మీడియా సమావేశంలో ఫైర్ అయిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,జూలై8 :**
గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకి వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకి వదులు తున్నాడన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు.

## దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా

- నా అధికారలేంటో నాకు తెలియదా
- కొండా సురేఖ వ్యవహారంపై కడియం


02

**జనగామ,జూలై8 :**
తాను ఎక్కడా దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షలు చేయడం కానీ, మంత్రి కొండా సురేఖ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కానీ చేయలేదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జిల్లా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఏఐసీసీకి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'నేను ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకు ఇస్తా' అని అన్నారు.

## గురుకుల విద్యార్థుల ఆరోగ్యం,భద్రతపై అప్రమత్తం

- వర్షాకాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- పారదర్శక అడ్మిషన్ల పక్రియ నిర్వహించాలి
- నాణ్యమైన బోధనకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్,జూలై8 :**
తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు, వేడి నీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. మిగతాద్ది 2 లో



2లో..

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్దలో ముందడుగు

- రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన
- నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం
- ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**నాగర్‌కర్నూల్,జూలై8 :**
రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# చంద్రబాబు కోసమే గోదావరి నీళ్లు వదిలేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చన్నారు. సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు.మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

## ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై కట్టుకథలు

మొదటిపేజీ తరువాయి

మీ పగలు.. ప్రతీకారాలు ప్రతిపక్షం మీద తీర్చుకోండి, అన్నంపెట్టే రైతును మాత్రం ఆగం చేయకండి అని హితవు పలికారు. కాళేశ్వరంలో నిండుగా నీళ్లు పారుతున్నా మీ పొలాలను ఎండబెతున్న కాంగ్రెస్ కర్కశ పాలన తీరును ప్రశ్నించండి అని తెలంగాణ రైతన్నలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎక్కడా చుక్కనీళ్లు లేని కాలంలోనూ.. కాళేశ్వరమే ప్రాణెళిశ్వరమై కాపాడుతుందని అర్థం చేసుకోవాలన్నారు.వానల్లేక.. ఎవుసం జరగక అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించడం లేదా? కాళేశ్వరం దగ్గర పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి..గోస తీర్చాలన్న సోయి కలగట్లేదా? అని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. లోటు వర్షపాతంతో నాట్లు పడట్లేదు.. విత్తనాలు వేయట్లేదు.. పంటలు సాగుచేసే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వమేమో ఏమీ పట్టించుకోకుండా దున్నపోతు మీద వానపడ్డట్టే వ్యవహరిస్తున్నదని తెలిపారు. కన్నెపల్లి పంప్ హౌజ్ మోటర్లను నడిపించి.. కరువు రాకుండా కాపాడు కోవాలన్న బుద్ధి ఎందుకు లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా

మొదటిపేజీ తరువాయి

ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశానని చెప్పారు. అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, సమస్యలు మాత్రమే విన్నవించినట్లు వివరించారు. దేవదాయ శాఖలో నిధులు లేవంటే... నియోజకవర్గం లోని ఆలయాల సమస్యల పరిష్కారానికి ఎస్టిమేషన్‌లను మాత్రమే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదని తెలుసన్నారు. ఇదంతా అవగాహన లోపంతోనే జరుగు తోందన్నారు. కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారని.. కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ ప్రజల మధ్యలో ఉండాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం.. మంత్రులను అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని చెప్పారు. ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కమిషనర్‌ను కలిసినట్లు కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

# తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

మొదటిపేజీ తరువాయి

ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ఫైలును పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్-3 ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్-3 తో పాటు సత్తుపల్లి బ్లాక్-3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయ కుండా నష్టం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులను, అలాగే తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు.

## గోద్రెజ్ ఆధ్వర్యంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్

మొదటిపేజీ తరువాయి

గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గా÷-డ్గ÷న్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గా÷-డ్గ÷న్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే

మొదటిపేజీ తరువాయి

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు. దశాబ్దాల పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వంలో సాకారం చేస్తోంది. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూ నిర్వాసితులకు కూడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం. రెవెన్యూ శాఖ పరిధిలోని గద్వాల జిల్లా కావాల్సిన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం.పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ప్రజాప్రభుత్వం అని మంత్రి తెలిపారు.

## గురుకుల విద్యార్థుల ఆరోగ్యం,భద్రతపై అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర సచివాలయంలో విద్యా సంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యా నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వర్షాకాల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... గురుకులాల్లో ప్రవేశాల ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, వసతి, తరగతి గదులు, బోధన సిబ్బంది, వంటశాలల సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా బోధన సిబ్బంది కొరత ఉంటే సంబంధిత జిల్లా కలెక్టర్ల అనుమతితో నిబంధనల ప్రకారం తాత్కాలిక నియామకాలు చేపట్టి బోధనకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు పెరుగుతుందని, ప్రతి గురుకులంలో ముందస్తు ఆరోగ్య ప్రణాళిక అమలు చేయాలని మంత్రి
స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన వేడి నీరు అందుబాటులో ఉంచాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నీటి ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. నీటి నాణ్యతను పరీక్షించి, అవసరమైన చోట వాటర్ ప్యూర్గి÷యైర్లు, క్లోరినేషన్, ఫిల్టరేషన్ సదుపాయాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. బాలికల గురుకులాలు, హాస్టళ్లలో మరింత అప్రమత్తత అవసరమని మంత్రి పేర్కొన్నారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు ప్రతిరోజూ శుభ్రంగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సానిటరీ న్యాప్‌కిన్ల అందుబాటు, డిస్పోజల్ యూనిట్లు, మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, అవసరమైన చోట మహిళా కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి గురుకులంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలని మంత్రి తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు నిరంతర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, చర్మవ్యాధులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైతే చికిత్సకు పంపే విధంగా ఆరోగ్య ప్రోటోకాల్ అమలు చేయాలని సూచించారు. వంటశాలలు, డైనింగ్ హాళ్లు, నిల్వ గదుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. నాణ్యమైన కూరగాయలు, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల సరఫరా నిరంతరంగా జరిగేలా పర్యవేక్షించాలని, నిల్వ ఆహార పదార్థాల నాణ్యతను తరచుగా తనిఖీ చేయాలని చెప్పారు. విద్యార్థులకు పౌష్టికాహారం, సురక్షితమైన వసతి, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను దశలవారీగా విస్తరించేందుకు ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ, ఉన్నత విద్యా అవకాశాలు మరింత చేరువయ్యేలా సీఓఈల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల వేతనాలు ప్రతి నెలా ఒకటో తేదీన జమయ్యేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వేతనాల విడుదలలో జాప్యం లేకుండా ఆర్థిక, పరిపాలనా ప్రక్రియలను ముందుగానే పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ట్రైబల్ వెల్ఫేర్ డిపా÷-టం÷-మెంట్ డైరెక్టర్ సంతోష్ ,తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంస్థ కార్యదర్శికంభంపాటి శారద, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి నటరాజ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పది రూపాయల నాణెళిలతో బైక్ కొనుగోలు

కొంత మంది తాము చేసే పని వినూత్నంగా ఉండాలని భావిస్తారు. అలా చేయడంతో వారి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. తాజాగా బైక్ కొనుగోలు చేయడానికి ఎంచుకున్న మార్గంతో ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండే రఘుపతి బైక్ కొనుగోలు చేశారు. అందుకు అవసరమైన రూ.1.10 లక్షల మొత్తాన్ని రూ.10 నాణెళిల రూపంలో చెల్లించారు. ఈ బైక్ కొనడం కోసం చాలా కాలంగా ఆయన రూ.10 నాణెళిలను పొదుపు చేస్తూ వచ్చారు. అలా దాచిన నగదును అంతా కవర్లలో నింపుకుని బైక్ షోరూమ్‌కు వెళ్లారు. ఈ నగదు చెల్లించి తనకు ఇష్టమైన స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను ఆయన కొనుగోలు చేశారు. షోరూమ్‌లోని సిబ్బంది అంతా కలిసి ఈ నగదును లెక్కించారు. నగదు లెక్కించడానికి కొన్ని గంటల సమయం పట్టింది.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని,అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ÷రిళిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు

# చెక్ బౌన్స్ కేసుల్లో సత్వర న్యాయం

## 18న స్పెషల్ లోక్ అదాలత్




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లిలో చెక్ బౌన్స్ కేసుల్లో సత్వర న్యాయం అందించేందుకు ఈ నెల 18న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మెట్‌పల్లి ఇంచార్జి సీనియర్ సివిల్ జడ్జి డి నాగేశ్వర్ రావు బుధవారం తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న చెక్ బౌన్స్ కేసుల పరిష్కారం కోసం నిర్వహించే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం కావడానికి న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా సీఐ సురేష్, ఎస్సైలు కిరణ్ కుమార్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

# మెట్‌పల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## 2 లక్షల నిధులు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లిలో బుధవారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి రూ. 2 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. 13వ వార్డు బాలకృష్ణ నగర్ కాలనీలో రూ. లక్షతో నూతన కల్వర్టు, 17వ వార్డులో రూ. లక్షతో డ్రైనేజ్ పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో త్వరలో మున్సిపాలిటీలోని 26 వార్డులలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని, పట్టణాన్ని సుందరీకరించడానికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు.

# సిరికొండ అక్షయ్ కు పి.హెచ్.డి

## ఖరగ్ పూర్ ఐఐటీ డిగ్రీ ప్రదానం



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన చేట్ పెల్లి అక్షయ్, సోమవారం రోజున ఐఐటీ ఖరగ్ పూర్ 72వ స్నాతకోత్సవంలో ప్రొఫెసర్ పార్థ సాహ, డీన్ లు ఆనంద్ భట్టాచార్య, గార్గి దాస్ చేతుల మీదుగా పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్నారు. ఇన్ఫ్రారెడ్ అణచివేత పరికరాలు అనే అంశంపై ఆయన డాక్టరేట్ పొందారు. అత్యుత్తమ విద్యాసంస్థ నుండి డిగ్రీ అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అక్షయ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముదాం రవి, ఉప సర్పంచ్ చిట్యాల మల్లయ్య, గాంధారి శ్రీనివాస్, మల్యాల మారుతి, ప్రతాప్, ప్రశాంత్, వెంకటేష్ అక్షయ్ ను అభినందించారు.

# 24వ వార్డులో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌పై అవగాహన కార్యక్రమం

**ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించిన బీజేపీ నేత రాజేష్ ఠాకూర్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జులై 8**

జమ్మికుంట: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 24వ వార్డులోని 175వ బూత్ పరిధిలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఎన్యూమరేషన్ ఫారమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ ఠాకూర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ఎన్యూమరేషన్ ఫారమ్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను సరిచూసుకుని, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు వార్డుకు చెందిన స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలి

**జమ్మికుంట మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:జూలై 8**

జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పించారు. జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరంనేని పరుశరామ్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేసిన మహానేత వైఎస్సార్ సేవలను కొనియాడుతూ ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోట స్వప్న, గిరవేన శ్రీనివాస్ యాదవ్, దొగ్గల భాస్కర్, పింగిలి రాకేష్, పింగిలి రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొడిగ శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాచపల్లి సాగర్, బిజిగిరి శ్రీకాంత్, కోరపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పోల్సాని సాగర్ రావు, కొండు బిక్షపతి, బండారి శ్రీధర్, పుల్లూరు రవి, మేకల కొమరయ్య, కనకం కుమార్, పుల్లూరు సంపత్,



పుల్లూరి సమ్మయ్య, కుమార్, రామచంద్ర, సమ్మయ్య, మహేష్‌తో పాటు జమ్మికుంట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వనమహోత్సవంలో భాగంగా జమ్మికుంటలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్

**"తల్లి జన్మనిస్తే.. మొక్కలు పునర్జన్మ ఇస్తాయి" -- ప్రతి కుటుంబం మొక్కలు నాటి సంరక్షించాలి**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 8:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని అన్నారు. నేటి తరంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రతి కౌన్సిలర్, ప్రతి కుటుంబం, ప్రతి మహిళ తమ ఇళ్ల పరిసరాల్లో



తప్పనిసరిగా మొక్కలు నాటాలని, వాటిని పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. "తల్లి జన్మనిస్తే.. మొక్కలు పునర్జన్మ ఇస్తాయి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని కోరారు. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, కాలనీలు, గృహాల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు



నాటాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాచర్ల రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఎల్ఆర్‌పీలు (సీఎల్ఆర్‌పీలు), ఆర్‌పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్న రావణ్ పై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలి

**వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ డిమాండ్**

**నరసరావుపేట, కరపత్రం ప్రతినిధి జూలై 08 :**

ప్రశ్న రావణ్ పై పెట్టిన కేసులు తక్షణం ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉన్నదని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధించే చర్యలకు నాయకత్వంలోని ప్రభుత్వం దిగజారడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా ఈ పాలకులు గౌరవిస్తున్నారు ఇప్పటికీ ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. ప్రశ్న రావణుని పై పెట్టిన కేసులను ఉపసంహరించు కోవాలి అన్నారు. రాష్ట్రంలో అక్రమ అరెస్టుల పేరుతో ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను పక్కదోవ పట్టిస్తుందని గతంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు గత ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకల పై దాడి చేస్తూ మాట్లాడిన వీరు అధికారం చేపట్టిన తర్వాత అదే చట్టాన్ని ప్రశ్నించే గొంతుకులపై తిరిగి ప్రయోగించడానికి ఎంతవరకు సమంజసం అని వైదన ప్రశ్నించారు. నాడు పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లకు ఇదే ఉపా చట్టం వర్తించదా? సూటిగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్న వారిపై ఉప చట్టాలను అధికారం ఉంది కదా అని పెట్టుకుంటూ పోతే రాష్ట్రంలో ప్రజలందరి ఉప చట్టాన్ని ప్రయోగించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని దాని విలువలను పక్కనపెట్టి విమర్శించారు. ఇటు కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా సనాతన ధర్మం హిందూ పేరుతో ఇష్టం వచ్చినట్లు ప్రజాస్వామ్యాన్ని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి వారి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుంటే వారికి తానా తందాన అంటూ ఆపాలని తీవ్రంగా ఖండిస్తున్నాయని వైదన అన్నారు. సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తే దానికి సరియైన సమాధానం చెప్పలేక ఉపవాచట్టాలను ఉపయోగించి వారి అరెస్టు చేయడం వేధించటం సరికాదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైదన వెంకట్ డిమాండ్ చేశారు.



# కల్తీ నూనెలు, సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌కు జమ్మికుంటలో ఇక నో ఎంట్రీ

**నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.2 వేల వరకు జరిమానా.. ప్రత్యేక తనిఖీలతో కఠిన చర్యలు హోటళ్లు, టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులకు మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి హెచ్చరిక**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 8:**

ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న జమ్మికుంట మున్సిపాలిటీ, కల్తీ నూనెలు మరియు సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలకు సిద్ధమైంది. నిబంధనలు పాటించని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి స్పష్టం చేశారు. జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అధ్యక్షతన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వంటల్లో కల్తీ నూనెలు లేదా పలుమార్లు ఉపయోగించిన వంట నూనెను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు. పామాయిల్‌కు బదులుగా డబుల్ ఫిల్టర్ పల్లి నూనె, సన్‌ఫ్లవర్ నూనె



వంటి నాణ్యమైన వంట నూనెలనే ఉపయోగించాలని సూచించారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు విక్రయించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఆదేశించిన కమిషనర్, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్లు, ఆహార పదార్థాలు అందించవద్దని తెలిపారు. వాటికి బదులుగా ఆకులు, కాగితపు లేదా ఇతర పర్యావరణహిత పాత్రలను వినియోగించాలని సూచించారు. టీ స్టాళ్లలో టీని గాజు లేదా స్టీల్ గ్లాసుల్లో మాత్రమే అందించాలని పేర్కొన్నారు. వారం రోజుల తర్వాత మున్సిపల్ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపడతారని, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రూ. 1,000 నుంచి



రూ. 2,000 వరకు జరిమానా విధించడంతో పాటు మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. హోటళ్లు, బజ్జీ బండ్లు, టీ స్టాళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు, తలకు హెడ్ క్యాప్, ముఖానికి మాస్క్ ధరించాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ, విక్రయ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, సదానందం, హోటల్ యజమానులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు, బజ్జీ బండ్ల యజమానులు, తోపుడు బండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

గురువారం జూలై 09, 2026

# వైఎస్సార్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి"

▪ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించిన హనుమకొండ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు అయ్యాల రాంరెడ్డి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 8**
హనుమకొండ డీసీసీ భవన్‌లో దివంగత ముఖ్యమంత్రి, ప్రజానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ డీసీసీ ఉపాధ్యక్షులు అయ్యాల రాంరెడ్డి పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయ్యాల రామిరెడ్డి మాట్లాడుతూ.. "వైఎస్సార్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి" అని పేర్కొన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, సేవాభావంతో పనిచేసిన మహానేతగా వైఎస్సార్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మాచర్ల మహేందర్, 65 డివిజన్ కార్యదర్శి కొప్పుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 8**
ప్రజా సంక్షేమాన్ని పరమావధిగా చేసుకుని రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. బుధవారం
దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా హనుమకొండ డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ..ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ పాలన సాగిందన్నారు. రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళల అభ్యున్నతి కోసం ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడిగా వైఎస్సార్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**-సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం**
రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు.

# శ్రీహరి జన్మదిన వేడుకల్లో.. కార్యాలయ సిబ్బంది

▪ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కార్యాలయ అధికారులు, సిబ్బంది



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 8**
మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదినాన్ని పురస్కరించుకుని, బుధవారం హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఆయన నివాసంలో ఆత్మీయ వాతావరణంలో శుభాకాంక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యక్తిగత, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ఆయురారోగ్యాలతో నిండి దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరారు.

# ఘనంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు..



▪ అన్నదానం, వైఎస్సార్‌కు నివాళులు, రైతు భరోసా నిధుల విడుదలపై హర్షం







**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జులై 8**
స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం పండుగ వాతావరణాన్ని తలపించింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించగా, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.
పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు.
జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని కడియం శ్రీహరి, డాక్టర్ కడియం కావ్య కలిసి ప్రారంభించారు. అనంతరం వారు స్వయంగా భోజన వడ్డనలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వందలాది మంది భక్తులు, ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలనను స్మరించుకుంటూ నాయకులు ఆయన సేవలను కొనియాడారు.
రైతు భరోసా నిధుల విడుదల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, మహిళా, ప్రజా సంక్షేమ పథకాలు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. వేడుకల్లో వివిధ మండలాల పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# దివ్యాంగ చిన్నారులతో నిరాడంబరంగా శ్రీహరి జన్మదిన వేడుకలు



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 8**
మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన జన్మదిన వేడుకలను బుధవారం నిరాడంబరంగా నిర్వహించారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులను ఆప్యాయంగా పలకరించి, స్వయంగా స్వీట్లు అందజేస్తూ వారితో సన్నిహితంగా మమేకమయ్యారు. చిన్నారులు శ్రీహరికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపగా, వారి ప్రేమాభిమానాలకు ఆయన కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. సేవా భావంతో, సామాజిక బాధ్యతను ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకలు అందరి ప్రశంసలు అందుకున్నాయి.

# ఘనంగా వైయస్ డా. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు



**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూలై 08**
దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు వరంగల్ తూర్పు నియోజకవర్గం లోనీ పోచమ్మ మైదానం సెంటర్ లో బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ఎండి అయూబ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మరియు ఎమ్మెల్సీ శ్రీ బస్వరాజు సారయ్య,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎరబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం తాపత్రయపడ్డారని, రైతులకు ఉచిత కరెంటు, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ లాంటి పథకాలు ఎన్నో తీసుకొచ్చి పేదల అభ్యున్నతికి పాటుపడినరని, పేర్కొన్నారు. రాజకీయంగా మేము తెలంగాణ వాదుల మైనప్పటికీ, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో రంగశాయిపేట లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, వరంగల్ శాశ్వత మంచినీటి పథకానికి, రాజీవ్ గృహకల్ప కింద ఇండ్లను తదితర పథకాలను మంజూరు చేసి శంకుస్థాపన చేసిన మహనీయులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. కానీ డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి వారసులమని చెప్పుకునే పెద్దలు, గతంలో దేశాయిపేట, దూపకుంట లో పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ పట్టాల లబ్ధిదారులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూములు మంజూరు చేయించి ఇచ్చినప్పుడే డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నిజమైన నివాళులు అర్పించిన వారవుతారని ఆ విధంగా లబ్ధిదారులకు, లబ్ధి చేకూర్చే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు నల్లగొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బసవరాజు శిరిష శ్రీమన్, తత్తరి లక్ష్మణ్, జన్ను అరుణ్, దామెర సర్వేశం, ధూపం సంపత్ , జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కురివి పరమేశ్వర్, తూర్పు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి సలీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, జన్ను రవి, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సోమలక్ష్మి, గిరి గిరి పుష్ప ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మండి బజార్ మర్చంట్ అధ్యక్షులు ఎండి మాషుక్, ఓబీసీ కోఆర్డినేటర్ కోదాటి అనిల్, ఎన్ ఎస్ యు ఐ నగర్ మాజీ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్, బొలుగొడ్డు శ్రీనివాస్, సందెల దామోదర్, బత్తిని లింగయ్య, నరిగే శ్రీను తోట బాలరాజు, మార్త ఆంజనేయులు, రామ యాదగిరి, బోలుగోడు అనిల్, గుత్తికొండ తిరుపతి,బత్తుల వినోద్, గజ్జల లింగమూర్తి, ఎండి కమాలుద్దీన్, పెండ్యాల కొమురయ్య, నటరాజు శ్రీధర్, ఇనుగాల బాబు, డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్, సన్నీ , గుండేటి సతీష్ వస్కుల ఉదయ్, బండ్ల సురేందర్ జిన్నారపు రాజు, ఆదాం, కుసుమ మురళి తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులను కలవడం నా హక్కు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

▪ అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టాలి.. అనవసర వివాదాలకు తావివ్వొద్దు



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూలై 8**
ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏ అధికారినైనా కలవడం తన హక్కు అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై దేవాదాయ శాఖ కమిషనర్‌ను కలిసి, ఆలయ కమిటీ చైర్మన్లతో కలిసి పలు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.
తాను ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, రాజ్యాంగం, వ్యాపార నిర్వహణ నియమావళి ప్రకారం తన అధికారాలు, పరిమితులపై పూర్తి అవగాహనతోనే వ్యవహరిస్తున్నానని పేర్కొన్నారు. అవగాహన లోపంతో కొందరు అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని, తాను తప్పు చేయనప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.
ప్రజా సమస్యలను పక్కనబెట్టి కొందరు వివాదాలను సృష్టించి వార్తల్లో నిలవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల్లో దేవాదుల ప్రాజెక్టు, ఎంజీఎం ఆసుపత్రికి శాశ్వత సూపరింటెండెంట్ నియామకం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం వంటి కీలక అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసమే అధికారాన్ని వినియోగించాలే గానీ, వివాదాలకు వేదికగా మార్చకూడదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

# డాక్టర్‌ను బెదిరించి రూ.15 కోట్లు దోచుకునే కుట్ర భగ్నం

▪ ముగ్గురు నిందితుల అరెస్ట్.. మొబైల్ ఫోన్లు, బైక్ స్వాధీనం



**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూలై 8**
ప్రముఖ వైద్యుడిని హత్య చేస్తామని బెదిరించి రూ. 15 కోట్లు వసూలు చేయాలన్న కుట్రను హనుమకొండ పోలీసులు భగ్నం చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, నేరానికి ఉపయోగించిన నాలుగు మొబైల్ ఫోన్లు, ఓ హీరో ప్లెన్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, గతంలో బాధిత వైద్యుడి వద్ద డ్రైవర్‌గా పనిచేసిన యమగోని సుభాష్ గౌడ్ ఉద్యోగం కోల్పోవడంతో కక్ష పెంచుకున్నాడు. వైద్యుడు ఆర్థికంగా స్థిరపడిన వ్యక్తి కావడంతో బెదిరింపుల ద్వారా డబ్బులు గుంజాలని భావించి, తన స్నేహితులు శ్రీమూర్తి శ్రీనివాస్, బానోత్ రమేష్‌లతో కలిసి కుట్ర పన్నాడు.
వైద్యుడి కుటుంబం, నివాసం, ప్రయాణాలకు సంబంధించిన వివరాలు సేకరించిన నిందితులు, రూ. 15 కోట్ల సుపారీ వచ్చిందని, డబ్బులు ఇవ్వకపోతే హత్య చేస్తామని ఫోన్‌లో బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా, నిఘా సమాచారంతో నిందితులను గుర్తించారు.
బుధవారం ఆస్పత్రి వద్ద మరోసారి రెక్కీ నిర్వహించేందుకు వచ్చిన నిందితులు ములుగు క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీల సమయంలో పోలీసులను గమనించి పరారయ్యే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ కె. కిషోర్‌తో పాటు పోలీసు సిబ్బందిని సీఐ మచ్చ శివకుమార్ అభినందించారు.
బెదిరింపు కాల్స్, డబ్బు డిమాండ్లు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌ను లేదా అత్యవసర పోలీసు సేవలను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# ముస్లిం మత పెద్దలతో ఎమ్మెల్యే నాయిని ఆత్మీయ సమావేశం



**కరపత్రం ప్రతినిధి వరంగల్/హనుమకొండ,జూలై 8**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మత పెద్దలు,మసీదు కమిటీ ప్రతినిధులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సమాజానికి సంబంధించిన పలు అంశాలపై మత పెద్దల అభిప్రాయాలను ఆయన ఓర్పుగా ఆలకించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మత సామరస్యం,సామాజిక ఐక్యతను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ ప్రజల మధ్య సోదరభావం,పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. అనంతరం ముస్లిం మత పెద్దలు తమ ప్రాంతాల సమస్యలు,అభివృద్ధి అవసరాలు,ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు సూచనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సానుకూలంగా పరిశీలించి,పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా,డాక్టర్ అనీఫ్ సిద్ధిఖీ,మాజీ కార్పొరేటర్ అబూబాకర్‌తో పాటు పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.